Digital, tmedia.net.in

టీ-మీడియా

tmedia.net.in

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

శనివారం 10/10/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

భూ వివాద రహిత తెలంగాణే లక్ష్యం

- రాష్ట్రాన్ని 7 జోన్లుగా విభజించి రీసర్వే
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

టీ.మీడియా,అక్టోబర్9,హైదరాబాద్ బ్యూరో : తెలంగాణలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే ధ్యేయంగా ప్రభుత్వం సమగ్ర భూ పునఃసర్వేపై దృష్టి సారించింది. సుమారు 125 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో చేపట్టిన ఈ రీసర్వేను ఏడాదిన్నరలో పూర్తి చేయాలని రెవెన్యూ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. సర్వేలో వేగం పెంచడంతోపాటు పారదర్శకత, కచ్చితత్వానికి పెద్దపీట వేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం రాష్ట్రాన్ని 7 జోన్లుగా విభజించి, పర్యవేక్షణకు 14 మంది అధికారులను నియమించారు.తొలి దశలో 2,768 గ్రామాల్లో సర్వే చేపట్టగా ఇప్పటివరకు 245 గ్రామాల్లో పూర్తయినట్లు మంత్రి వెల్లడించారు. నవంబర్ చివరి నాటికి తొలి దశ సర్వే పూర్తి చేయాలని అధికారులకు లక్ష్యంగా నిర్దేశించారు. సర్వే పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు హైదరాబాద్‌లో ప్రత్యేక డాష్



బోర్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఎవరైనా అధికారులు రీసర్వే పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు.

నవంబర్ నాటికి తొలి దశ పూర్తి

భూవివాద రహిత తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర భూ పునఃసర్వేను ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా భూ రీసర్వేను వేగంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో సర్వే పర్యవేక్షణకు నియమించిన అధికారులతో మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రతి దశలోనూ నాణ్యతను నిర్ధారించాలని మంత్రి స్పష్టం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో 2,768 గ్రామాల్లో రీసర్వే కొనసాగుతోందని, ఇప్పటివరకు 245 గ్రామాల్లో పూర్తయిందని మంత్రి వెల్లడించారు. నవంబర్ చివరి నాటికి తొలి దశను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పిన మంత్రి మొత్తం

➤ మిగతా 2వ పేజీలో..



కాసులు కురిపిస్తోన్న వరి

- కోతకు ముందే అడ్వాన్స్‌లు
- మద్ధతు ధర కంటే ఎక్కువ చెల్లింపులు

టి మీడియా , అక్టోబర్ 9 ,హైదరాబాద్ బ్యూరో : వానాకాలం సీజన్‌లో 65 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని, దశల వారీగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నప్పటికీ, ఈసారి పరిస్థితి గతానికి భిన్నంగా ఉంది. గతంలో రైతులు తమ ధాన్యం తూకం వేయించుకోవడానికి కొనుగోలు కేంద్రాల (పీపీసీ) వద్ద వారాల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు పరిస్థితి తలకిందులై, రైతుల రాక కోసం కేంద్రం నిర్వాహకులు ఎదురు చూస్తున్నారు.

అడ్వాన్స్‌లు ఇచ్చి మరీ ధాన్యం కొనుగోలు ఒప్పందాలు

నిజామాబాద్ జిల్లాలో అక్టోబర్ 1నే కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనప్పటికీ, బుధవారం నాటికి ఒక్క రైతు కూడా ధాన్యం తీసుకురాలేదని, అదే సమయంలో ప్రైవేట్ మార్కెట్‌లో పెద్ద ఎత్తున అమ్మకాలు జరుగుతున్నాయని అధికారిక వర్గాలు ధ్రువీకరించాయి. గతానికి భిన్నంగా రైస్ మిల్లర్లు, వ్యాపారులు, మధ్యవర్తులు పంట కోతకు ముందే రైతులకు అడ్వాన్స్‌లు చెల్లించి, ధాన్యం కొనుగోలుకు ఒప్పందాలు చేసుకుంటున్నారు.పంట కోత పూర్తయిన వెంటనే లారీల ద్వారా ధాన్యం తరలిస్తున్నారు. గతంలో అమ్మకం తర్వాత చెల్లింపులకు 20 నుంచి 45 రోజుల

➤ మిగతా 2వ పేజీలో..

వైఎస్సార్సీపీకి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

స్థానిక సమరానికి గ్రీన్ సిగ్నల్

టి మీడియా , అక్టోబర్ 9 ,అమరావతి బ్యూరో : వైఎస్సార్సీపీకి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. "సర్" ప్రక్రియ పూర్తయిన తర్వాతే స్థానిక ఎన్నికలు జరపాలంటూ వైఎస్సార్సీపీ దాఖలు చేసిన పిటిషన్?పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఆ పార్టీ



➤ మిగతా 2వ పేజీలో..



అధికార పార్టీల హవా

➤ 2వ పేజీలో..

నానాపటేకర్ మృతిపై అనుమానాలు

కేసు నమోదు చేసిన పోలీసులు

టి మీడియా , అక్టోబర్ 9 , ఢిల్లీ బ్యూరో : ప్రముఖ నటుడు నానాపటేకర్ మృతిపై గోవా పోలీసులు అసహజ మరణం కింద కేసు నమోదు చేశారు. పనాజీ పోలీసులు భారతీయ నాగరిక్ సురక్షిత సంహిత సెక్షన్ 194 కింద ఈ కేసును ఫైల్ చేశారు. పోలీస్ రికార్డుల ప్రకారం, డోనాపౌలాలో ఉన్న ఆయన నివాసం (ఓషన్ పార్క్?) నుంచి బాంబోలిమ్‌లో మణిపాల్ ఆస్పత్రికి తీసుకెళ్లేసరికే 76 ఏళ్ల పటేకర్ ప్రాణాలు కోల్పోయారు. అందుకే వైద్యులు చట్టప్రకారం దీనిని మెడికోలీగల్ కేస్‌గా నమోదుచేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. నానాకు గుండెపోటు వచ్చిన సమయంలో ఇంట్లో కుటుంబసభ్యులు ఎవరూ లేరు. కేవలం స్నేహితులు, కేర్‌టేకర్ మాత్రమే వచ్చి ఆయన్ను ఆస్పత్రికి తరలించారు. ఇలాంటి సందర్భాల్లో కుటుంబ సభ్యులతో పాటు, ఆయన చుట్టుపక్కల ఉన్నవారి వాంగ్మూలాలను చట్టబద్ధంగా రికార్డ్ చేయడానికి పోలీసులు ప్రాథమికంగా ఈ కేసు నమోదు చేశారు. ఈ కేసుపై తదుపరి దర్యాప్తు పీఎస్?ఐ నితిన్ నాయక్ నేతృత్వంలో జరుగుతోంది. ప్రస్తుతం దర్యాప్తు ప్రాథమిక దశలో ఉన్నందున పోలీసులు మరిన్ని వివరాలను వెల్లడించలేదు.

ఆయన వేధింపులకు సాక్ష్యాలు ఉన్నాయ్?!

నానాపటేకర్ వేధింపులకు సంబంధించి తన వద్ద సాక్ష్యాలు ఉన్నాయని తనూశ్రీ దత్తా పేర్కొన్నారు. ఈ కేసులో హెయిర్? డ్రెస్సర్ అఫిడవిట్ చాలా కీలకమని ఆమె అన్నారు. "మేడమ్ చెబుతున్నదంతా నేను స్వయంగా చూశాను" అని ఆమె కోర్టుకు సమర్పించిన అఫిడవిట్?లో పేర్కొన్నారని తెలిపారు. అయితే ఈ ప్రధాన సాక్షిని కోర్టు ముందు నిజం చెప్పమని ఒప్పించడానికి తనకు ఐదేళ్లు పట్టిందన్నారు. అయితే ఆమెను కూడా నానాపటేకర్ బెదిరించాడని తనూశ్రీ దత్తా పేర్కొన్నారు. అయితే ఈ కీలక సాక్షి తన అఫిడవిట్?ను కోర్టులో సమర్పించిన రోజే ఆ కేసును మూసివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కేసు మూసివేసినంత మాత్రాన నానాపటేకర్ తప్పు చేయలేదని అర్థం కాదని తనూశ్రీ దత్తా పేర్కొన్నారు. 'గెలిచిన వారే ఎప్పుడూ సరైనవారు కాకపోవచ్చు' అని ఆమె

➤ మిగతా 2వ పేజీలో..

'జెన్ జీకి భయపడుతున్న కేంద్రం

భయపడి కేంద్రం ఆంక్షలు
- -సీజేపీ విమర్శలు

టి మీడియా , అక్టోబర్ 9 , బెంగళూరు :దిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ అక్టోబర్ 10న భారీ ఎత్తున నిరసన నిర్వహించనున్నట్లు పిలుపునివ్వగా దేశ రాజధానిలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇక్కడ మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దు, ప్రజా రవాణాపై ఆంక్షలు విధించిన నేపథ్యంలో సీజేపీ నేతలు కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ నిరసనను అడ్డుకోవడానికి కేంద్రం దిల్లీని సైనిక కోటలా మార్చిందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో తీవ్ర అవకతవకలు జరిగాయని ఆరోపిస్తున్న సీజేపీ దీనికి బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తుంది. ఇందులో భాగంగానే దిల్లీ జంతర్ మంతర్ వద్ద శనివారం నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపింది.ఈ క్రమంలోనే బెంగళూరు నుంచి తిరుగుపయనం అవుతూ ముంబై విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే. తమ నిరసనను అడ్డుకోవడానికి ప్రజల రాకపోకలపై ఆంక్షలు విధించడం సరికాదని, వారిని ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని ప్రశ్నించారు. శనివారం జంతర్ మంతర్ వద్ద నిర్వహించ తలపెట్టిన నిరసనను విరమించుకోబోమని స్పష్టం చేశారు. జెన్ జీని చూసి కేంద్రం భయపడుతోందని వ్యాఖ్యలు చేసిన దీప్కే– యువతను చూసి అంతగా భయపడుతుంటే దేశం మొత్తాన్ని మూసేయండని ఆగ్రహం వ్యక్తం చేశారు. దిల్లీ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాల ప్రైవేట్ ప్రాపర్టీ ఏం కాదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.నిరసనల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఒకవైపు చెబుతూనే, మరోవైపు మెట్రో స్టేషన్లు, రైళ్ల రాకపోకలపై ఆంక్షలు విధించడం వల్ల ప్రజలకు మరింత



ఇబ్బంది కలగదా? అని ప్రశ్నించారు. కేంద్రం చర్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని అభిజీత్ తెలిపారు. కశ్మీర్, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల నుంచి భద్రతా బలగాలను దిల్లీకి ఎందుకు తరలిస్తున్నారని, యువతను పాకిస్థానీలను చూసినట్లు చూస్తుందని దీప్కే మండిపడ్డారు. తనను అరెస్ట్ చేయడం వల్ల సమస్యలు పరిష్కారమవుతాయని ప్రభుత్వం భావిస్తే, ధైర్యముంటే తనను అరెస్ట్ చేయాలని సవాల్ విసిరారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ చేసిన దానికి ఆయన శిక్ష అనుభవించాలని, సర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇక దిల్లీలో ప్రస్తుత పరిస్థితులను ఎమర్జెన్సీతో పోల్చారు మరో సీజేపీ నేత సౌరవ్ దాస్. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పార్టీ కార్యకర్తలను నిర్బంధిస్తున్నారని, కొందరిని గృహ నిర్బంధం చేశారని ఆరోపించారు. ఆంక్షలు, పరిమితులతో దిల్లీని కోటలా మార్చారని విమర్శించారు.

రాష్ట్రపతి తోసిపుచ్చకపోవడం ఆశ్చర్యమే

ఆధారాలు ఇవ్వాలని కోరారు: రాహుల్

టి మీడియా , అక్టోబర్ 9 , ఢిల్లీ బ్యూరో : ఓట్ల చోరీ జరుగుతోందన్న తమ ఆరోపణలను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తోసిపుచ్చకపోవడం ఆశ్చర్యం కలిగించిందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ఓట్ల చోరీకి సంబంధించిన ఆధారాలు సమర్పించాలని ఆమె కోరినట్లు వెల్లడించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ, ఎన్నికల కమిషన్ వ్యవహారాలపై ఇండీ కూటమి నేతలు శుక్రవారం రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని, ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రపతి భవన్‌లో ద్రౌపదీ ముర్ముతో భేటీ అనంతరం రాహుల్ గాంధీ మీడియాతో

➤ మిగతా 2వ పేజీలో..



వైఎస్సార్సీపీకి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

లేవనెత్తిన ఏ విషయాన్నీ అత్యున్నత న్యాయస్థానం పరిగణనలోకి తీసుకోలేదు. హైకోర్టు ఇచ్చిన సమయం ప్రకారం 6 వారాల గడువులోపు నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధమని రాష్ట్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు తెలిపింది. అయితే నోటిఫికేషన్ విడుదలలోపు సర్ ప్రక్రియ పూర్తైతే ఆ జాబితానే ప్రామాణికంగా తీసుకోవాలని సుప్రీంకోర్టు ఎస్?ఈసీకి సూచించింది.

సర్ ప్రక్రియ పూర్తికాకుంటే పాత జాబితా ప్రకారమే ఎన్నికలు నిర్వహించుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ విషయంలో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సమర్థించింది. వార్డుల పునర్విభజన అడ్డుకోవడం, ఎన్నికలకు ఆటంకం కలిగించడమంటే ప్రజా ప్రయోజనాలను అడ్డుకోవడమేనని ధర్మాసనం వ్యాఖ్యానించింది. . ఇబ్బంది పడేవారికి లేని బాధ మీకెందుకని వైఎస్సార్సీపీ లాయర్?ను కోర్టు నిలదీసింది. ఎన్యూమరేటర్లు, ప్రభుత్వం, కేంద్రం ఎవరికీ లేని నొప్పి మీకెందుకని ప్రశ్నించింది.

బీసీ రిజర్వేషన్ల కేసు కొట్టివేత

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అంశంపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. 34 శాతం కోటాతో మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని దాటుతున్నాయంటూ ఏపీ ప్రభుత్వం జారీ చేసిన రెండు జీవోలను హైకోర్టు ఇటీవల కొట్టివేసిన సంగతి తెలిసిందే. దీంతో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం నిరాకరించింది.

డెడికేటెడ్ కమిషన్ నివేదిక అమలు చేస్తున్నామని ప్రభుత్వ న్యాయవాది చెప్పగా, ఎక్కడ ఉందని జస్టిస్ దీపాంకర్‌దత్త ధర్మాసనం ప్రశ్నించింది. నివేదిక ఆధారంగా ఫ్యామిలీ డేటాను పరిగణనలోకి తీసుకుంటారని ధర్మాసనం వ్యాఖ్యానించగా, నివేదిక ఇంకా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని ప్రభుత్వ న్యాయవాది ముకుల్ రోహత్గీ వివరించారు. ఫ్యామిలీ డేటాను డెడికేటెడ్ కమిషన్ నుంచి తీసుకున్నట్లు తెలిపారు. నివేదిక ఆమోదం లేకుండా డేటా తీసుకోవడంలో హైకోర్టు కారణం సరిగానే ఉందన్న సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

నానాపటేకర్ మృతిపై అనుమానాలు

వ్యాఖ్యానించారు. అంతేకాదు దేశ న్యాయవ్యవస్థ పట్ల తన అసహనాన్ని వ్యక్తం చేశారు.

స్వగ్రామంలో అంత్యక్రియలు

సినీ జీవితంలో నటసామ్రాట్?గా పేరు ప్రఖ్యాతలు సంపాదించిన నానాపటేకర్? గురువారం గోవాలో మరణించారు. దీనితో ఆయన భౌతికకాయాన్ని ప్రత్యేక ఎయిర్ అంబులెన్స్? ద్వారా పుణె విమానాశ్రయానికి తీసుకువచ్చారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో ఆయన స్వగ్రామమైన డోంజేకు తీసుకువచ్చారు. తర్వాత ఆయన అంత్యక్రియలను ఆయన నివాస ప్రాంతంలో నిర్వహించారు. వేలాది మంది అభిమానులు తరలివచ్చి ఆయనకు తుది వీడ్కోలు పలికారు.

రాష్ట్రపతి తోసిపుచ్చకపోవడం ఆశ్చర్యమే

మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కలిసి ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తున్నారని తమ వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. అయితే, తమ ఆరోపణలను రాష్ట్రపతి తోసిపుచ్చలేదని అన్నారు. 'ఓట్ల చోరీ జరుగుతోందన్న ఆరోపణలను రాష్ట్రపతి ఖండిస్తారని భావించాను. దేశంలో ఎన్నికల వ్యవస్థ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఉందని చెబుతారని అనుకున్నాను. కానీ, మేం చెప్పిన విషయాలను ఆమె తోసిపుచ్చకపోవడం నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది' అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

మేమే కాదు..మీరూ లాభపడ్డారు

- **భారతీయులకు ఉద్యోగాలొచ్చాయి..అమెరికా సంపద పెరిగింది**
- **పరస్పరం ప్రయోజనం పొందాం..ఆ విషయాన్ని గుర్తించండి**
- **భారతీయ ఐటీ కంపెనీలనుపెర్మ్ నుంచి అమెరికా సస్పెండ్ చేయడంపై భారత్ తీవ్ర ఆక్షేపణ**
- **విదేశీ ఉద్యోగులు 'ఒప్పంద బానిసలుఅన్న వాన్స్ వ్యాఖ్యలపై ఆగ్రహం**

వాషింగ్టన్, న్యూఢిల్లీ, అక్టోబరు 9: తమ ఉద్యోగులకు గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవటానికి అవకాశం కల్పించే 'పర్మినెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్' (పెర్మ్) నుంచి అంతర్జాతీయ, భారతీయ ఐటీ దిగ్గజ కంపెనీలను సస్పెండ్ చేస్తూ అమెరికా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని భారత్ ఖండించింది. ఈ తరహా చర్యలు ఇరుదేశాల ఉమ్మడి ఆకాంక్షలను ముందుకు తీసుకెళ్లవని స్పష్టం చేసింది. అమెరికన్లకు అవకాశాలు ఇవ్వకుండా విదేశీ ఐటీ నిపుణులను ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నాయన్న ఆరోపణలతో ఇన్ఫోసిస్, టాటా, విప్రో, హెచ్?సీఎల్, మైక్రోసాఫ్ట్, అడోబ్, క్యాప్‌జెమినీ, కాగ్నిజెంట్ కంపెనీలను పెర్మ్ నుంచి అమెరికా సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం భారత విదేశాంగశాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. నిపుణులైన భారతీయులు అమెరికాకు వెళ్లి ఉద్యోగాలు చేయటం వల్ల భారత్‌కే కాదు, అమెరికాకూ అపారమైన ప్రయోజనాలు కలుగుతున్నాయని గుర్తు చేసింది. 'అమెరికా కంపెనీలు బలోపేతమవుతున్నాయి. అమెరికాలో సంపద పెరుగుతోంది' అని పేర్కొంది. అమెరికాలో పని చేస్తున్న విదేశీ ఉద్యోగులను ఆ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ 'ఒప్పంద బానిసలు'గా పేర్కొనటాన్ని కూడా విదేశాంగశాఖ తీవ్రంగా ఆక్షేపించింది. 'ఇటువంటి వ్యాఖ్యలు సరైనవి కావు. అమెరికాలోని భారతీయ నిపుణులు బాగా చదువుకున్నవాళ్లు, ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు, ఆవిష్కరణల రంగానికి తమ నైపుణ్యాలతో ఎంతగానో తోడ్పాటును అందిస్తున్నవాళ్లు. తరతరాల వలసప్రజల శ్రమ, ఆవిష్కరణలతోనే అమెరికా ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందింది అన్న విషయాన్ని మర్చిపోవద్దు' అని హితవు పలికింది.

మాపై ప్రభావం ఉండదు: టీసీఎస్

పెర్మ్ నుంచి సస్పెండ్ చేయటం వల్ల తమ కంపెనీపై పెద్దగా ప్రభావం ఉండదని టీసీఎస్ ప్రకటించింది. అమెరికాలోని తమ సంస్థల్లో స్థానికులకే ఉద్యోగావకాశాల్లో ప్రాధాన్యమిస్తున్నామని, గత రెండేళ్లలో పెర్మ్ నియామకాలు రెండంకెల్లో కూడా లేవని స్పష్టం చేసింది. అమెరికా కార్మికశాఖ జారీ చేసే నిబంధనలను పూర్తిగా పాటిస్తున్నట్లు పేర్కొంది. అమెరికాలో తమ కంపెనీకి చెందిన 31 కార్యాలయాలు, డెలివరీ సెంటర్లు నడుస్తున్నాయని.. వచ్చే ఐదేళ్లలో మరో 15 వేల మందిని ఉద్యోగాల్లోకి తీసుకోనున్నామని తెలిపింది. మైక్రోసాఫ్ట్ కూడా తాజా పరిణామంపై స్పందిస్తూ.. అమెరికాలోని తమ ఉద్యోగుల్లో మెజారిటీ అమెరికన్లేనని వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం ప్రభుత్వానికి తాము సమర్పించిన 6వేల హెచ్-1బీ వీసా దరఖాస్తుల్లో 20 శాతం మాత్రమే కొత్త వారివని స్పష్టం చేసింది

భూ వివాద రహిత తెలంగాణే లక్ష్యం



సమగ్ర భూ పునఃసర్వేను ఏడాదిన్నరలో ముగించేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

మండలానికి 2 సర్వే బృందాలు

భూ సర్వే పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు రాష్ట్రాన్ని 7 జోన్లుగా విభజించి, ఒక్కో జోన్‌కు రెవెన్యూ, సర్వే విభాగాల నుంచి ఇద్దరు చొప్పున 14 మంది అధికారులను నియమించారు. ప్రతి మండలంలో కనీసం 2 రెవెన్యూ గ్రామాల్లో సర్వే చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం ప్రతి మండలానికి 2 సర్వే బృందాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా లైసెన్స్‌డ్ సర్వేయర్‌తోపాటు జీపీవో, డిప్యూటీ తహసీల్దార్ లేదా ఆర్ఐ లేదంటే ఇతర సిబ్బంది ఈ బృందాల్లో ఉంటారు.

చిన్న పొరపాటుకు కూడా తావుండకూడదు

సర్వే జరుగుతున్న గ్రామాల్లో తహసీల్దార్లు ప్రతిరోజూ పర్యటించాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. రోజువారీగా ఎన్ని ఎకరాలు, ఎన్ని సర్వే నంబర్లు పూర్తయ్యాయి? ఎన్ని గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయి? ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తోంది? క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా? అనే వివరాలను సేకరించాలని సూచించారు. చిన్న పొరపాటుకు కూడా తావులేకుం డా సర్వే నిర్వహించాలని, భవిష్యత్తులో మళ్లీ భూ వివాదాలు తలెత్తకుండా రికార్డులను కచ్చితంగా రూపొందించాలని మంత్రి స్పష్టం చేశారు.

డాష్‌బోర్డును ఏర్పాటు చేయాలి

రీసర్వే పురోగతిని రాష్ట్రస్థాయి నుంచి పర్యవేక్షించేందుకు హైదరాబాద్‌లో ప్రత్యేక డాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని పొంగులేటి ఆదేశించారు. గ్రామాల వారీగా సర్వే వివరాలు, రోజువారీ పురోగతి, పనిచేస్తున్న బృందాలు, వినియోగిస్తున్న రోవర్లు, వాటి లొకేషన్ వంటి సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునేలా సాంకేతికతను ఉపయోగించనున్నట్లు తెలిపారు. సర్వేకు అవసరమైన సిబ్బంది, రోవర్లు, సర్వర్లు, ఇతర సాంకేతిక పరికరాల కొనుగోలుకు నిధుల కొరత ఉండదని మంత్రి స్పష్టం చేశారు. అవసరమైన నిధులను వెంటనే విడుదల చేస్తామని తెలిపారు. అదనపు రోవర్లను కొనుగోలు చేయాలని ఆదేశించారు.

డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవు

ప్రతి వారం రాష్ట్రస్థాయిలో సమీక్ష నిర్వహించాలని, ప్రతి 15 రోజులకు తాను స్వయంగా పురోగతిని పరిశీలిస్తానని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వ భూముల సర్వే సమయంలో సరిహద్దుల గుర్తింపునకు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. రీసర్వే పేరుతో ఎవరైనా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసినా, ప్రజలను ఇబ్బందులకు గురిచేసినా సహించేది లేదని హెచ్చరించారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కాసులు కురిపిస్తోన్న వరి

సమయం పట్టేది. కానీ ఇప్పుడు ధాన్యం మిల్లుకు చేరిన రోజే పూర్తి చెల్లింపులు జరుగుతున్నట్లు సమాచారం. దీనివల్ల ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం పరిమాణం అంచనాల కంటే తక్కువగా ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా ప్రైవేట్ మార్కెట్‌లో 'సన్న రకం' ధాన్యానికి మంచి ధర లభిస్తుండటంతో మిల్లర్లు, వ్యాపారులు నేరుగా పొలాల వద్దకే ఏజెంట్లను పంపి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు.

6.5 లక్షల టన్నులు మాత్రమే సేకరించిన ప్రభుత్వం

నిజామాబాద్ జిల్లాలో సుమారు 12 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయగా, ప్రభుత్వం 6.5 లక్షల టన్నుల సేకరణ లక్ష్యాన్ని నిర్దేశించింది. మొత్తం 721 కేంద్రాలకు గానూ ఇప్పటికే 420 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు జిల్లా అధికారులు తెలిపారు. ఒక దశలో సన్నరకం ధాన్యం క్వింటాల్?కు రూ.3,700 వరకు పలికింది. ప్రస్తుతం అది సుమారు రూ.3,300 - రూ.3,500 వరకు అమ్ముడవుతున్నట్లు సమాచారం. రంగెల్ గ్రామానికి చెందిన వెంకటేశ్? 28 క్వింటాళ్ల ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు క్వింటాలుకు రూ.3,650 చొప్పున విక్రయించారు.

నల్గొండలో 'అమ్మిన రోజే డబ్బులు'

నల్గొండ, మిర్యాలగూడ పరిసర గ్రామాల్లోనూ, చిట్యాల, దామరచర్ల వంటి మండలాల్లోనూ పంట కోతలు ప్రారంభమయ్యాయి. దామరచర్ల మండలంలో ఒక రైతు బీపీటీ చింట్లు రకాన్ని సాగు చేశారు. పంట కోతకు ముందే ఒక మిల్లర్ క్వింటాల్?కు రూ.3,700 చొప్పున అడ్వాన్స్ ఇచ్చారు. కోత తర్వాత సుమారు 70 బస్తాల ధాన్యాన్ని రెండు ట్రాక్టర్లలో తరలించారని, అదే రోజున చెల్లింపు జరిగిందని నివేదికలు చెబుతున్నాయి. ఎల్?నినో ప్రభావం, రాబోయే యాసంగి సీజన్‌లో సాగు విస్తీర్ణంపై అనిశ్చితి వంటి కారణాల వల్ల మిల్లర్లు పెద్ద మొత్తంలో ధాన్యాన్ని సేకరించేందుకు సిద్ధమవుతున్నారని సివిల్ సప్లైస్ కార్పొరేషన్ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.

65 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం 8,283 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి సన్నద్ధమవుతోంది. అయితే రైతుల పంటలో గణనీయమైన భాగం ప్రైవేట్ కొనుగోలుదారులకు విక్రయిస్తే ప్రభుత్వ కేంద్రాలకు చేరే ధాన్యం పరిమాణం అంచనాల కంటే తక్కువగా ఉండవచ్చు. నల్గొండ జిల్లాకు 4.5 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం ఉన్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం 2 నుంచి 3 లక్షల టన్నులు మాత్రమే కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

అదేవిధంగా నిజామాబాద్‌లో 6.5 లక్షల టన్నుల లక్ష్యానికి గానూ సేకరణ 4 లక్షల టన్నులకు చేరుతుందా? లేదా? అనే సందేహాలు ఉన్నాయి. మరోవైపు సన్నరకం బియ్యం ధరలు ఇప్పటికే భారీగా పెరిగాయి. ఒకవేళ మిల్లు యజమానులు, వ్యాపారులు సన్నరకం వరి ధాన్యాన్ని అధిక మొత్తంలో ముందుగానే సేకరిస్తే, మార్కెట్ సరఫరా కొద్ది మంది చేతుల్లోనే కేంద్రీకృతమయ్యే ప్రమాదం ఉంది. భవిష్యత్తులో బియ్యం ధరలు పెరగడానికి ఇటువంటి పరిస్థితి దారితీయవచ్చని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అలాగే పేదలకు పంపిణీ చేసే సన్న బియ్యం అవసరాలను తీర్చడంలో సవాళ్లు ఎదురయ్యే అవకాశం కూడా ఉంది.

అధికార పార్టీల హవా

- **బెంగాల్ ఉప ఎన్నికల్లో 2 సీట్లలో బీజేపీ జయభేరి**
- **తమిళనాడులో 2 సీట్లు ఖాతాలో వేసుకున్న టీవీకే**
- **అసోంలోని నగావ్ లోక్‌సభ స్థానం బీజేపీదే**
- **పుదుచ్చేరి అసెంబ్లీలో ఏకైక స్థానాన్ని కైవసంచేసుకున్న ఏఐఎన్ఆర్సీ**
- **బీజేపీ గెలుపుపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం**



న్యూఢిల్లీ/ చెన్నై, అక్టోబరు 9 మూడు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో ఐదు అసెంబ్లీ, ఒక లోక్‌సభ స్థానానికి ఈ నెల 6న జరిగిన ఉప ఎన్నికల్లో ఆయా రాష్ట్రాల్లోని అధికార పార్టీలే జయభేరి మోగించాయి. బెంగాల్‌లోని నందిగ్రామ్, రెజీనగర్.. తమిళనాడులోని మధురాంతకం, ధారాపురం.. పుదుచ్చేరిలోని తట్టంచావడి అసెంబ్లీ స్థానాలతోపాటు అస్సాంలోని నగావ్ లోక్‌సభ స్థానానికి నిర్వహించిన ఉప ఎన్నికల ఫలితాలను శుక్రవారం వెల్లడించారు. నందిగ్రామ్‌లో బీజేపీ అభ్యర్థి హసిరాణి రథ్ తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌ను రికార్డు స్థాయిలో 1,22,753 ఓట్ల తేడాతో ఓడించారు. హసిరాణికి 1,64,427 ఓట్లు పోలవగా, మిలన్ ప్రధాన్‌కు 41,674 ఓట్లు మాత్రమే వచ్చాయి. ముస్లిం ఓటర్లు అధికంగా ఉన్న రెజీనగర్‌లో కూడా బీజేపీ జయకేతనం ఎగురవేసింది. ఇక్కడ బీజేపీ అభ్యర్థి శంకర సర్కార్ తన సమీప ప్రత్యర్థి, ఆమ్ జనతా ఉన్నయన్ పార్టీ(ఏజేయూపీ) అభ్యర్థి గొలామ్‌నబీ ఆజాద్‌పై 75,816 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఇక్కడ దాదాపు 60 శాతం ముస్లిం ఓటర్లే ఉంటారు. అస్సాంలోని నగావ్ లోక్‌సభ స్థానంలో అధికార బీజేపీ అభ్యర్థి దేబాశిష్ శర్మ తన సమీప ప్రత్యర్థి, ఏఐయూడీఎఫ్ అధినేత బద్రుద్దీన్ అజ్మల్‌ను 1,42,224 ఓట్ల తేడాతో ఓడించారు. గెలుపొందిన బీజేపీ అభ్యర్థులనుప్రధానిమోదీ అభినందించారు. ముస్లిం ఓటర్లు బీజేపీని ఆదరిస్తున్నారనటానికి ఈ ఫలితాలే నిదర్శనమన్నారు.

తమిళనాట టీవీకేదే ఆధిపత్యం..

తమిళనాడులోని మధురాంతకం (ఎస్సీ) అసెంబ్లీ స్థానంలో అధికార తమిళగ వెట్రి కళగం(టీవీకే) అభ్యర్థి మరగతం కుమారవేల్ తన సమీప ప్రత్యర్థి, డీఎంకే అభ్యర్థి పరంధామన్‌ను 20,040 ఓట్ల తేడాతో ఓడించారు. ధారాపురం (ఎస్సీ)లో టీవీకే అభ్యర్థి సత్యభామ.. డీఎంకే అభ్యర్థి సుగన్యను 9,471 ఓట్ల తేడాతో ఓడించారు. ఈ గెలుపుతో తమిళనాడు అసెంబ్లీలో టీవీకే బలం 109 సీట్లకు పెరిగింది. 234 సీట్లున్న తమిళనాడు అసెంబ్లీలో మెజారిటీ మార్కు 118 కాగా, ఏప్రిల్- మేలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే 108 సీట్లు గెలిచింది. రెండుసీట్లలో గెలిచిన సీఎం విజయ్ తిరుచిరాపల్లి ఈస్ట్ స్థానాన్ని వదులుకోవటంతో ఆ పార్టీ బలం 107కు తగ్గింది. తాజాగా 109కి పెరిగింది. పుదుచ్చేరిలోని తట్టన్‌చావడి స్థానంలో అధికార ఏఐఎన్ఆర్సీ పార్టీ అభ్యర్థి అశోక్ ఆనంద్ కాంగ్రెస్ అభ్యర్థి ఈ వినాయగమ్‌ను 8,400 ఓట్ల తేడాతో ఓడించారు.

మడుపల్లి ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబురాలు.



టీ మీడియా, అక్టోబర్ 9, మధిర :తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు... బతుకమ్మ ప్రతీక. ప్రకృతితో మమేకమై పల్లె ప్రజలంతా సంబరంగా జరుపుకునే తెలంగాణ రాష్ట్ర ప్రధాన పండుగ ప్రారంభమవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని స్థానిక పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మడుపల్లి నందు విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులతో.. ఎంతో భక్తి శ్రద్ధలతో రంగురంగుల బతుకమ్మలను పేర్చి.. బతుకమ్మలను కీర్తిస్తూ కోలాటాలు, నృత్యాలతో సంబరం నిర్వహించుకున్నారు. ప్రధానోపాధ్యాయులు శ్రీ తోట నరసింహారావు గారు మాట్లాడుతూ బతుకమ్మ పండుగను అద్భుతంగా నిర్వహించుకున్న విద్యార్థులను ప్రత్యేకంగా అభినందిస్తూ, ఈ దసరా విద్యార్థుల జీవితాలలో , వారి కుటుంబాలలో సరికొత్త వెలుగును ప్రసాదించాలని ఆకాంక్షించారు. శ్రీమతి శైలజ, సంధ్య లక్ష్మి, శ్రీదేవి, మాధురి, సుష్మ ,సీత ,సువర్ణ,భాను తదితర ఉపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

నాలుగో రోజుకు చేరిన కాంట్రాక్ట్ వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులధర్నా



టీ మీడియా,అక్టోబర్9,చింతూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంట్రాక్టు వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు ఏ.పి జేఏసీ పిలుపు మేరకు ఐటీడీఏ ముందు చేస్తున్న నిరసనలో భాగంగా నాలుగో రోజున మౌన పోరాట దీక్ష చేపట్టారు . గత నెల రోజుల నుండి ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లినప్పటికీ,పలుదపాలుగా చర్చలుకు పిలిచి, ఆ చర్చలు విప్లవం అయినందున, ముకుమ్మడిగా అత్యవసర సేవలు, విధులు బహిష్కరించి తమ యొక్క న్యాయమైన డిమాండ్లను మీడియా, పబ్లిక్ కి తెలియజేశారు .తమ మొదటి డిమాండ్ రెగ్యులరైజేషన్, రెగ్యులర్ అయ్యేంత వరకు అప్పటివరకు 100% గ్రాస్ శాలరీ ఇవ్వాలని,. ఉద్యోగరీత్యా ఎవరైనా విధి నిర్వహణలో మరణిస్తే ఆ కుటుంబానికి 50 లక్షలు ఎక్స్‌గ్రేసీయా అందించాలని అలాగే . ప్రస్తుతం ఉద్యమం శాంతియుతంగా నిరసన ద్వారా తెలియజేస్తూ ధర్నా చేస్తున్నామని .తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే, తాము నిర్వహించే ఎమర్జెన్సీ సర్వీసులను కూడా నిలిపివేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు . కరోనా లాంటి విపత్కర సమయంలో ఎంతోమంది ప్రాణాలు తెగించి తమ ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలు అందించామని .ఆ సమయంలో తోటి సిబ్బంది చాలామంది ప్రాణాలు త్యాగం చేశామని,తమ కుటుంబాలకు ఎటువంటి భరోసా, ఆర్థిక న్యాయం కానీ ఆ కుటుంబాలకు ప్రభుత్వం అందించలేదని పేర్కొన్నారు. కొన్ని సంఘాలు నిరసన కార్యక్రమానికి సంఘీభావం తెలిపాయన్నారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యఆరోగ్య సిబ్బంది, తోటి పారామెడికల్ సిబ్బంది చింతూరు డివిజన్ ఎ హెచ్ , పి హెచ్ సి ఎ సిహెచ్ సి సిబ్బంది శ్రీనివాస్, రామకృష్ణ,ప్రవీణ్ కుమార్, జయ, లక్ష్మి,సీతయ్య,గంగరాజు, పలీన, రాజమణి,తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి.

• వ్యవసాయ కార్మిక సంఘం



టీ మీడియా ,అక్టోబర్ 9 ,కూసుమంచి: తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, వ్యవసాయ కార్మికులకు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని, వెంటనే కూసుమించి మండలంలోని అన్ని గ్రామాలలో ఉపాధిహామీ పనులను ప్రారంభించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు తోటకూరి రాజశేఖర్, చిట్టూరి వెంకన్న డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో హనుమంతరావు కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ సాధారణ వర్షపాతం కన్నా 50 శాతం తక్కువగా వర్షం కురిసిందని, సుమారు 3 నెలలుగా పంటలు పండక తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడి, జీవనం కోసం వేరు ప్రాంతాలకు వలసలు వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వి. బి. జి. రాంజీ బిల్లును రద్దుచేసి గతంలో కొనసాగించిన మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని, ఉపాధి హామీ పథకం పనులను అదనంగా మరో రెండు లక్షల కోట్లు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులు సంవత్సరానికి 200 రోజులు పని కల్పించి, 2 పూటల ఫోటో పద్ధతి, కొలతల విధానశీ రద్దు, వి. బి. జి. రాంజీ బిల్లును రద్దుచేసి, పాత పద్ధతి మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అన్ని రకాల ప్రమాదాలకు భీమా సౌకర్యం వర్తించే విధంగా వ్యవసాయ కార్మికులకు, మున్సిపల్ ,పట్టణ, గ్రామీణ పేదలకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్ చేయాలని రాజశేఖర్, వెంకన్న డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాలేరు డివిజన్ అధ్యక్షులు బిక్కసాని గంగాధర్, వ్యవసాయ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు శీలం గురుమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కందుల బాబు, మండల కమిటీ సభ్యులు జవ్వాజి శీను, చీర్ల రామకృష్ణ, కర్ణ బాబు, కస్తాల వీరబాబు, రైతు సంఘం నాయకులు వెన్ను ఉపేందర్, చిట్టూరి మహేష్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ నివాసాలు పై ఏసీబీ దాడులు



టీ మీడియా, అక్టోబర్ 9, ఖమ్మం :

ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే అనుమానంతో సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ వాసంశెట్టి నరసింహారావుకు సంబంధించిన నివాసాలు, బంధువుల ఇళ్లలో అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు శుక్రవారం సోదాలు చేపట్టినట్లు సమాచారం. గతంలో ఖమ్మం జిల్లాలో సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్‌గా పనిచేసిన నరసింహారావు ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన ఆస్తులు, ఆదాయ వనరులపై ఏసీబీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం.ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు ఆరు నుంచి ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. ఇందులో భాగంగా ఖమ్మం నగరంలోని కవిరాజ్‌నగర్‌లో ఉన్న మోహన్ అనే బంధువు నివాసంతో పాటు నేలకొండపల్లి మండలంలోని పలు ప్రాంతాల్లో అధికారులు సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా సూర్యాపేట జిల్లా, హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ ప్రాంతం, ప్రస్తుతం నరసింహారావు విధులు నిర్వహిస్తున్న మహబూబాబాద్ జిల్లాలోనూ ఆయనకు సంబంధించిన ఆస్తులు, నివాసాలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం.ూశ్రీంశీ =ఱుఽ – ఉప ఎన్నికల్లో విజయకేతనం.. రెండు స్థానాలనూ కైవసం చేసుకున్న టీవీకేగతంలో ఖమ్మం జిల్లాలో విధులు నిర్వహించిన సమయంలో నరసింహారావు సస్పెన్షన్‌కు గురైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన గత ఉద్యోగ నిర్వహణ, ఆర్థిక లావాదేవీలు, ఆస్తుల వివరాల పై ఏసీబీ అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. సుమారు 15 సంవత్సరాల ఉద్యోగ కాలంలో ఆయన పొందిన జీతభత్యాలతో పోలిస్తే కూడబెట్టిన ఆస్తుల విలువ అధికంగా ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంపై అధికారులు ఆస్తుల పత్రాలు, బ్యాంకు లావాదేవీలు, ఇతర ఆర్థిక రికార్డులను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.ూఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్న సోదాలతోపాటు ఇతర జిల్లాల్లో జరుగుతున్న తనిఖీల్లో ఎలాంటి ఆస్తులు గుర్తించారు, వాటి విలువ ఎంత, ఏవైనా కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారా అనే అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఏసీబీ అధికారుల నుంచి పూర్తి వివరాలతో కూడిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. సోదాల అనంతరం ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

హెల్త్ సబ్ సెంటర్ తనిఖీ



• చేసిన సర్పంచ్ బానోతు సదర్ లాల్‌లి

టీ మీడియా, అక్టోబర్9, అశ్వాపురం: గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో అశ్వాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ బానోతు సదర్ లాల్ స్థానిక హెల్త్ సబ్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీలో సబ్ సెంటర్‌లో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది విధుల నిర్వహణ, రికార్డుల నిర్వహణ, మౌలిక సదుపాయాలను పరిశీలించారు.ఈ సందర్భంగా సబ్ సెంటర్‌లో రోజువారీ రిజిస్టర్ అందుబాటులో లేకపోవడాన్ని గుర్తించిన సర్పంచ్, ప్రతిరోజూ రిజిస్టర్ నిర్వహిస్తూ వైద్య సేవలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.అదేవిధంగా, వైద్య సిబ్బంది తరచూ ఫీల్డ్ విధులకు వెళ్లడం వల్ల స్థానికంగా వైద్య సేవలు అందించడంలో జాప్యం జరుగుతోందని చుట్టుపక్కల ప్రజలు సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన సర్పంచ్, ఫీల్డ్ విధులు పూర్తిచేసిన వెంటనే తిరిగి సబ్ సెంటర్‌కు చేరుకొని ప్రజలకు అందుబాటులో ఉండాలని, సబ్ సెంటర్‌ను ప్రతిరోజూ తెరిచి ఉంచాలని స్పష్టం చేశారు.

అందుబాటులో ఉండాలిలి

గ్రామ ప్రజలకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందించడంతో పాటు, ప్రతిరోజూ రక్తపోటు, రక్తంలో చక్కెర, థైరాయిడ్ వంటి పరీక్షలను అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, వైద్య మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలని సర్పంచ్ సూచించారు. ప్రజలు వైద్య సేవల కోసం ఇబ్బందులు పడకుండా సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి హామీ

తనిఖీ సమయంలో హెల్త్ సబ్ సెంటర్‌లో నీటి సమస్య ఉన్నట్లు గుర్తించిన సర్పంచ్, సమస్యకు గల కారణాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మోటార్ మరమ్మతులో ఉందని సిబ్బంది వివరించడంతో, మోటార్‌కు మరమ్మతులు చేయించి సబ్ సెంటర్‌లో నీటి సమస్యను పరిష్కరిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు.గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన హెల్త్ సబ్ సెంటర్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామ ప్రజలు కూడా ఈ కేంద్రంలో అందుబాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామలక్ష్మి, హెల్త్ సబ్ సెంటర్ సిబ్బంది రమణమ్మ, ఉప సర్పంచ్ తుళ్లూరి ప్రకాశరావు, పంచాయతీ కార్యదర్శి యాకూబ్,మరియు పంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రైతులపై పిడి యాక్ట్‌లు



టీ మీడియా, అక్టోబర్ 9 ,ఆత్మకూరు:వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు రవి యాదవ్ అధ్యక్షతన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ అసహనం, అసమర్థతతో రైతుల అరెస్టులా, ప్రజల నిరసించే హక్కును అణిచివేసే హక్కు మీకు ఎక్కడిది.రైతులపై పెట్టిన కేసులు బేషరతుగా ఎత్తివేయాలి.అన్నం పెట్టే అన్నదాతలు అందరికోసం పంటలు కాపాడాలని కోరితే అక్రమ అరెస్టులతో అక్రమ కేసులతో వేధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం అని నిరంజన్ రెడ్డి నిప్పులు చెరిగారు. మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్ , లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్ మోహన్ రెడ్డి తో ఆత్మకూరులో పత్రికా సమావేశంలో మాట్లాడుతూ జూరాలలో 9టి.ఏం.సి ల నీటి లభ్యత ఉన్నా దిగుబడికి వచ్చిన పంటలకు నీళ్లు వదలాలని నిరసన వ్యక్తం చేసిన రైతులపై అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గ చర్య అని ఖండించారు.రైతులపై ప్రజా ఆస్తుల విధ్వంసం (పి.డి.పి.పి) యాక్టు పెట్టడం ప్రభుత్వ అణిచివేతకు నిదర్శనం అని దుయ్యబట్టారు. 20 సెప్టెంబర్ నాడు కేసు నం 103/2026మీద పి.డి. పి.పి కేసు పెట్టడం రైతుల హక్కులు హరించడం అని అన్నారు. సాగు జలాలు సాధించడానికి అవసరమైన కార్యాచరణ కోసం అనుభవంతో సలహాలు ఇచ్చాం, అధికారులతో మాట్లాడం జరిగిందని ప్రభుత్వం పేడ చెవిన పెట్టడంతో రైతులు తిరగబడ్డారని నిజం తెలుసుకొని రైతులకు ఊరట ఇవ్వడం మాని వేధించడం అన్యాయం అని ధ్వజమెత్తారు.రేవంత్ రెడ్డికి ఫ్యూచర్ సిటీపై ఉన్న ధ్యాస రైతులపై లేదు అని పాలమూరు బిడ్డనని చెప్పి ప్రాజెక్టులు పడావ్ పెట్టారని ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ఆధరం,బేధరం ప్రజల పక్షాన నిలబడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

చివరి ఆయకట్టు వరకు నీరు విడవాలి

• బంగ్లా డిమాండ్

టీ మీడియా అక్టోబర్ 9 ఆత్మకూరు:ఆత్మకూర్ నియోజకవర్గం లోని రేచింతల గ్రామంలో చివరి ఆయకట్టును సందర్శించి రైతులు పండించిన పంటలు ఎండిపోతున్న దృశ్యాలను చూసి రైతుల పేరిట అదికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే జూరాలనుండి చివరి ఆయకట్టు వరకు నీటిని విడుదల చేయాలనీ, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాకు దిగుతామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించిన మక్తల్ నియోజకవర్గ మీజ ఇంచార్జి డాక్టర్ బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి కార్యక్రమంలో మండల అధ్యక్షులు అశోక్ భూపాల్ ,మీజ ఎన్నికల సహా ఇంచార్జ్ జిందే శ్రీనివాస్ , రేచింతల శ్రీనివాస్ ,జిల్లా కౌన్సిల్ మెంబెర్ అంజి ముదిరాజ్ , లక్ష్మీకాంత్ , బలవీర్ , మురళి , మహేష్ , బీజేపీ భూత్ అధ్యక్షులు,పదాది కారులు పాల్గొన్నారు

ప్రజల ముంగిటకే ప్రజా పాలన

- ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి



టీ మీడియా ,అక్టోబర్ 9 ,దేవరకద్ర:మహబూబ్నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం చింతకుంట మండలంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఉదయం బ్రేక్ఫాస్ట్ కార్యక్రమంలో పాల్గొని, పాఠశాల పరిసరాలను పరిశీలించిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి . అక్కడికి వచ్చిన ప్రజల సమస్యలపై కూడా వెంటనే స్పందించారు.కల్యాణ లక్ష్మి పథకానికి సంబంధించిన దరఖాస్తులపై సంతకాల కోసం కొంతమంది లబ్ధిదారులు ఎమ్మెల్యే ని సంప్రదించగా, వారిని మరోచోటికి పంపకుండా అక్కడికక్కడే దరఖాస్తులను పరిశీలించి సంతకాలు చేశారు.ప్రత్యేకంగా కార్యాలయం ఏర్పాటు చేసుకుని కాకుండా, తాను ప్రయాణిస్తున్న వాహనం బానెట్పైనే దరఖాస్తులను ఉంచుకుని సంతకాలు చేయడం ద్వారా ప్రజల పని ఆలస్యం కాకుండా చూసుకున్నారు .ప్రజల కోసం కార్యాలయానికి రావాలని చెప్పడం కాదు, ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను పరిష్కరించడమే ప్రజాసేవ అని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో అందేలా ప్రజా ప్రతినిధి స్థాయిలో స్పందించడం ఈ ఘటనలో కనిపించింది.ప్రజల మధ్యే ఉంటూ.. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ.. సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపుతూ ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే ఈ కార్యక్రమం ప్రజా సేవలో ప్రత్యక్ష స్పందనకు ఒక ఉదాహరణగా నిలిచారు.

ఎమ్మెల్సీ ఓటు దరఖాస్తుల ప్రక్రియ



- రాకేష్‌రెడ్డి విజయానికి కృషి: బానోత్ మనీషా లక్ష్మి

టీ మీడియా,అక్టోబర్09,సింగరేణి(కారేపల్లి):నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కారేపల్లిలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ నాయకురాలు బానోత్ మనీషా లక్ష్మి ఆధ్వర్యంలో పట్టభద్రులతో ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సంబంధించిన దరఖాస్తులను పూర్తి చేయించారు.ఈ సందర్భంగా మనీషా లక్ష్మి మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యల పరిష్కారం,ఉద్యోగ అవకాశాల కల్పనకు బీఆర్ఎస్ కట్టుబడి ఉందన్నారు.అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.పట్టభద్రుల తరపున నిరంతరం ప్రజాసేవ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి విజయానికి పట్టభద్రులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేష్‌రెడ్డిని గెలిపించేందుకు పార్టీ శ్రేణులు పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డొంకెన రవీందర్,లాలు,జర్పుల హచ్చు,బానోత్ మోహన్,సోమందుల నాగరాజు,పేర్ని వెంకటేశ్వర్లు,జడల కళ్యాణ్, గుగులోత్ జుంకీలాల్, పొక్కిలి యుగంధర్,పిల్లలమర్రి వెంకటేశ్,పొడుగు హరీష్,భూక్య మధు,ధరావత్ రాకేష్,ధారావత్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

చెడుపై మంచిని సాధించడమే పండుగల సారాంశం

టీ మీడియా ,అక్టోబర్ 9 ,ఆత్మకూరు:వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని శ్రీ వాణి హై స్కూల్ లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల ప్రిన్సిపాల్ గారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీమతి లతా గంగాధర్, అంజనీ ఉపాధ్యాయులు రుచి, చైతన్య, నాగలక్ష్మి, ఆస్మా, స్వర్ణ , సువర్ణ, స్వాతి మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.పాఠశాలలలో దసరా సెలవులు ప్రకటించడంతో, పాఠశాల ఆవరణలో మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. వివిధ రకాల పువ్వులతో బతుకమ్మలను అందంగా అలంకరించి, ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నారు. వివిధ రకాల పూలతో అందంగా బతుకమ్మలను తయారు చేసి, దసరా సందర్భంగా జమ్మి చెట్టును,పాలపిట్టను చూపించడం జరిగింది.పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు బతుకమ్మ చుట్టూ పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ సందడి చేశారు.చిన్నారులు రంగురంగుల వేషధారణతో ఈ వేడుకలకు మరింత ఆనందాన్ని జోడించారు.విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసిమెలిసి పాఠశాల ఆవరణలో బతుకమ్మ పండుగను ఆనందంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ ఎంగిలిపువ్వు బతుకమ్మతో మొదలయ్యి,సద్దుల బతుకమ్మతో పూర్తి అయి దశమి రోజున దసరా పండుగను జరుపుకుంటామని, చెడుపై మంచిని సాధించడమే దసరా పండుగ యొక్క ప్రత్యేకత అని వారు తెలియజేశారు. ఈ సందర్భంగా అందరికీ బతుకమ్మ ,దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.



ఉపాధి పనులు వెంటనే ప్రారంభించాలి

- ఎంపీడీవోకు వ్యవసాయ కార్మిక సంఘం వినతి



టీ మీడియా,అక్టోబర్09,సింగరేణి(కారేపల్లి):గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కూలీలకు వెంటనే ఉపాధి పనులు కల్పించి ఆదుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.ఎల్నినో ప్రభావంతో గ్రామాల్లో రైతులు పంటల సాగుకు వెనుకడుగు వేయడంతో వ్యవసాయ కూలీలకు పనులు దొరకడం లేదని నాయకులు పేర్కొన్నారు.ఉపాధి లేక కూలీ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వీబీజీ రాంజీ కింద వెంటనే పనులు కల్పించాలని వినతిపత్రంలో కోరారు.ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కరువు పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.సాధారణంగా వ్యవసాయ సాగు కారణంగా జనవరి వరకు కూలీలకు పనులు లభించేవని,ప్రస్తుతం కరువు పరిస్థితులతో వ్యవసాయ పనులు తగ్గిపోయాయన్నారు.దీంతో ఉపాధి కోసం కూలీలు పట్టణాలకు వలస వెళ్తున్నారని,అక్కడ కూడా సరైన పనులు దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ప్రభుత్వం పరిస్థితి తీవ్రతను గుర్తించి గ్రామాల్లో ఉపాధి పనులను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.ప్రతి కూలీకి ఏడాదికి 200 రోజుల పని,రోజుకు రూ.700 కూలి కల్పించాలని కోరారు.ఉపాధి పనుల్లో కొలతల విధానం,రోజుకు రెండు ఫూటలా ఫోటోలు తీయడం వంటి నిబంధనలు కూలీలకు ఇబ్బందికరంగా మారాయని పేర్కొన్నారు.వీబీజీ రాంజీ బిల్లుతో వ్యవసాయ కూలీలు పని హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని,ఆ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ప్రతి వ్యవసాయ కూలీ కుటుంబానికి ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలని కోరారు.పేద కుటుంబాలపై నిత్యావసర వస్తువుల ధరల భారం తగ్గించేందుకు రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కేసగాని ఉపేందర్,నాయకురాలు చల్లా మల్లమ్మ,సీఐటీయూ నాయకులు శనగ రాంబాబు,జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలకు చేగువేరా స్ఫూర్తి

- కారేపల్లిలో 59వ వర్ధంతి



టీ మీడియా,అక్టోబర్9,సింగరేణి(కారేపల్లి):ప్రపంచ దేశాలపై ఆధిపత్యం చెలాయించేందుకు అమెరికా ఆరాటపడుతోందని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు,మండల కార్యదర్శి కె.నరేంద్ర విమర్శించారు.ప్రపంచ విప్లవకారుడు,యువతకు స్ఫూర్తిప్రదాత చేగువేరా 59వ వర్ధంతిని సీపీఐ(ఎం) సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కారేపల్లిలో నిర్వహించారు.ఈ సందర్భంగా చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ క్యూబా విప్లవ విజయంలో కీలక పాత్ర పోషించడంతో పాటు అమెరికా సామ్రాజ్యవాద విధానాలను అంతర్జాతీయ వేదికలపై ఎండగట్టిన విప్లవకారుడిగా చేగువేరా చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు.సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న ఉద్యమాలకు ఆయన జీవితం నేటికీ స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు.ప్రపంచంలోని సహజ వనరులు,సంపదపై ఆధిపత్యం సాధించాలనే లక్ష్యంతోనే అమెరికా వివిధ దేశాలపై ఒత్తిళ్లు,ఆంక్షలు,సుంకాల విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు.పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణల్లోనూ అమెరికా విధానాల ప్రభావం ఉందన్నారు.గుత్తాధిపత్యం ప్రపంచ దేశాలకు ఎంతటి ప్రమాదకరమో అమెరికా అనుసరిస్తున్న ఆర్థిక,రాజకీయ విధానాలు స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు.సామ్రాజ్యవాద ప్రమాదాన్ని చేగువేరా దశాబ్దాల క్రితమే గుర్తించి ప్రపంచ దేశాలను హెచ్చరించారని తెలిపారు.సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికి తన జీవితాన్నే అంకితం చేసిన గొప్ప విప్లవకారుడని కొనియాడారు.బొలీవియాలో చేగువేరా మరణం వెనుక అమెరికా పాత్ర ఉందని వారు ఆరోపించారు.అన్యాయం,దోపిడీ,సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడే యువతకు చేగువేరా నేటికీ మార్గదర్శకుడని పేర్కొన్నారు.ఆయన ఆశయాలు,పోరాట స్ఫూర్తిని అందిపుచ్చుకొని యువత ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఈ వర్ధంతి కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు కేసగాని ఉపేందర్,చల్లా మల్లమ్మ,గజ్జెల శ్రీను,శనగ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బడుల్లో బతుకమ్మ సందడి



ఆటపాటలతో అలరించిన చిన్నారులు

మీడియా,అక్టోబర్09,సింగరేణి(కారేపల్లి):కారేపల్లిలోని వివిధ విద్యాలయాలు శుక్రవారం బతుకమ్మ సంబురాలతో కళకళలాడాయి.శనివారం నుంచి విద్యార్థులకు దసరా సెలవులు ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాలల్లో ముందస్తుగా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి విద్యార్థులు,ఉపాధ్యాయులు వాటి చుట్టూ చేరి ఆటపాటలతో సందడి చేశారు.సంప్రదాయ వస్త్రధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.

బ్రిలియంట్ స్కూల్‌లో

కారేపల్లి బ్రిలియంట్ స్కూల్‌లో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు,ఉపాధ్యాయులు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి వాటి చుట్టూ చేరి బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలాడారు.ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ మల్లెల నాగేశ్వరరావు మాట్లాడుతూ పూలనే దేవతా స్వరూపంగా భావించి పూజించే ప్రత్యేకమైన పండుగ బతుకమ్మ అని అన్నారు.పూలకు,ప్రకృతికి,మహిళలకు విశిష్ట స్థానం కల్పించే ఈ పండుగ తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందన్నారు.

మాంటిస్సోరి స్కూల్‌లో

మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ప్రిన్సిపాల్ మినీ జోజో ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి సంప్రదాయ పాటలు పాడుతూ వాటి చుట్టూ ఆటలాడారు.చిన్నారుల ఆటపాటలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మినీ జోజో,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.



కస్తూర్బా విద్యాలయంలో

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులు బతుకమ్మ సంబురాలను ఘనంగా జరుపుకున్నారు.వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి సంప్రదాయ పాటలు పాడుతూ ఆటలాడారు.ప్రత్యేకాధికారి ఝాన్సీ సౌజన్య బతుకమ్మ పండుగ విశిష్టతను వివరిస్తూ ప్రకృతిని ఆరాధించే గొప్ప పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు.తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇటువంటి వేడుకలు దోహదపడతాయని తెలిపారు .అధ్యాపకులు, విద్యార్థినులు

పాఠశాలను ప్రారంభించిన ఐ టి డి ఏ పిఓ



టీ.మీడియా, అక్టోబర్9,చింతూరు:మండలంలోని నేలకోట గ్రామంలో సమారిటన్స్ ఫర్ ది నేషన్ అనే స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శిధిలావస్థలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనాన్ని పునరుద్ధరణ చేశారు. ఆ భవనాన్ని శుక్రవారం చింతూరు ఐటిడిఎ పిఓ నరేంద్ర పడాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో విద్యారంగా అభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇస్తూ ఏజెన్సీ ప్రాంతంలోని ఇతర పాఠశాల ల అభివృద్ధికి ప్రభుత్వం తో పాటు సమారటన్ ఫర్ ది నేషన్ లాంటి స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో ప్రత్యేక దృష్టి సారిస్తామని అన్నారు. ఈ సందర్భంగా సమారిటన్ పర్ ది నేషన్ సంస్థ వ్యవస్థాపకులు పి రామ్ కుమార్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించే లక్ష్యంతో సమారిటన్ ఫర్ ది నేషన్ అనే సంస్థ పని చేస్తుందని తెలిపారు. నేలకోట ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థలో ఉండగా తమ దృష్టికి వచ్చిందని, ఈ పాఠశాలలో 38 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని పాఠశాలలో మౌలిక వసతులతో పాటు అభివృద్ధి చేయాలని సంకల్పంతో ఈ పాఠశాలని పునరుద్ధరించామని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించి,వారి భవిష్యత్తుకు పునాది వేయడమే తమ లక్ష్యం అని రామ్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మోతుగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య అధికారి డాక్టర్ నీల్ వాసు, వైద్య సిబ్బంది, గూడూరు, కొత్తపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శులు తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ భూపతి తదితరులు పాల్గొన్నారు.

వీకేజీతో వృథాగా భగీరథ జలం

•మరమ్మతులు చేసినా తీరని సమస్య



టీ మీడియా,అక్టోబర్09,సింగరేణి(కారేపల్లి):మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్‌కు సంబంధించిన ఎయిర్ వాల్వ్ లీకేజీ కారణంగా విలువైన తాగునీరు వృథాగా పోతోంది.సింగరేణి మండలం అప్పాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని కవిత కాలేజీ సమీపంలో ఈ సమస్య నెలకొంది.ప్రధాన పైపులైన్‌కు అమర్చిన ఎయిర్ వాల్వ్ నుంచి నీరు లీకవుతూ పరిసరాల్లోకి ప్రవహిస్తోంది.తాగునీటికి ప్రాధాన్యం పెరుగుతున్న సమయంలో ఇలా పెద్ద మొత్తంలో మంచినీరు వృథా కావడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.లీకేజీ సమస్య తలెత్తినప్పుడల్లా తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నప్పటికీ పూర్తిస్థాయిలో పరిష్కారం కావడం లేదని స్థానికులు చెబుతున్నారు.కొద్దిరోజులకే తిరిగి లీకేజీ ఏర్పడి నీరు వృథాగా పోతోందని పేర్కొంటున్నారు.సంబంధిత మిషన్ భగీరథ అధికారులు స్పందించి ఎయిర్ వాల్వ్‌ను పూర్తిస్థాయిలో పరిశీలించి అవసరమైతే మార్చాలని కోరుతున్నారు.తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా శాశ్వత పరిష్కారం చూపి తాగునీటి వృథాను అరికట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసనకు సంఘీభావం



టీ.మీడియా,అక్టోబర్9,చింతూరు:చింతూరు ఐటీడీఏ ముందు వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగులు గత నాలుగు రోజులుగా చేస్తున్న నిరసన దీక్షలకు బిఆర్ అంబేద్కర్ దళిత సంక్షేమ సంఘం మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ కరోనా సమయంలో చేసిన సేవలను ప్రశంసించారు. తమ సంఘం మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పూర్తి సంఘీభావం, అండగా ఉంటామని తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ నిరసన దీక్షలో పాల్గొన్న ఉద్యోగులకు స్నాక్స్(బిస్కెట్స్) వాటర్ బాటిల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు మెల్లం నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి ఇంటి సుదర్శన్ కుమార్, సభ్యులు పట్రా జీవరత్నం, కట్టా శ్రీనివాసరావు, గంట్ల కిరణ్, గంగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దసరాసందర్భంగా సొంతూళ్లకు ప్రజలు



కిటకిటలాడుతున్న బస్టాండ్?లు

టీ మీడియా,అక్టోబర్9,హైదరాబాద్ బ్యూరో : హైదరాబాద్?లో పలు బస్టాండ్?లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. దసరా సెలవుల నేపథ్యంలో నగరవాసులు తమ సొంతూళ్లకు పయనమవుతున్నారు. ఫలితంగా వివిధ జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్?కు వెళ్లే వారితో బస్టాండ్?లలో రద్దీ నెలకొంది. పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యం కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేసింది. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ఇవాళ్టి నుంచి ఈనెల 18న తేదీ వరకు వివిధ జిల్లాలకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. ఈనెల 20వ తేదీ నుంచి 26 వరకు ప్రయాణికుల తిరుగు ప్రయాణం కోసం బస్సులను ఏర్పాటు చేయనుంది.దసరాకు ప్రభుత్వం ఈ నెల 10 నుంచి 22 వరకు పాఠశాలలకు సెలవులను ప్రకటించింది. తెలంగాణలో ఎంగిలిపూల బతుకమ్మతో రేపటి నుంచి బతుకమ్మ పండుగ ప్రారంభం కానుంది. ఈనెల 18వ తేదీన సద్దుల బతుకమ్మ వేడుకలతో ఈ వేడుకలు ముగియనున్నాయి. ప్రభుత్వ పరంగానూ బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటుచేసినట్లు ఇటీవల మంత్రి సీతక్క తెలిపారు. ప్రభుత్వం తరపున 18న హైదరాబాద్? ట్యాంక్?బండ్?పై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల మధ్య వేడుకలు జరగనున్నాయి.

ప్రతినెలా కమిషన్‌లు, ఆపై వడ్డీ వ్యాపారాలు

•పారిశుద్ధ్య కార్మికులపై

•సూపర్ వైజర్ల దందా



టీ మీడియా,అక్టోబర్9,హైదరాబాద్ బ్యూరో : మనం ఆరోగ్యంగా ఉండేందుకు అనేక జాగ్రత్తలను పాటించాలి. మరీ ముఖ్యంగా మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. అయితే ఇంట్లో చెత్తను మనం శుభ్రపరిస్తే వీధుల్లోని చెత్తను పలువురు సఫాయి కార్మికులు నిత్యం తొలగిస్తున్నారు. వీరు నిత్యం రోడ్లను శుభ్రం చేస్తున్నారు. అయితే కొందురు సూపర్?వైజర్లు మాత్రం వారి జేబులు కొడుతున్నారు. సఫాయి కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్నారు.ఒక్కో కార్మికుడి నుంచి ప్రతి నెలా రూ. 1,000 వసూలు చేస్తున్నారు. రాజధానిలోని మూడు కార్పొరేషన్ల పరిధిలో దాదాపుగా 28 వేల మంది కార్మికులు ఉన్నారు. వారిలో సుమారు సగం మందికి పైగా ఇలా నెల వారి మాముళ్లు ఇవ్వాల్సి వస్తోంది. ఈ లెక్కన చూసుకుంటే సూపర్?వైజర్లు ప్రతినెలా సుమారు రూ. 1.5 కోట్ల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా పోగేసిన సొమ్ముతో వడ్డీ వ్యాపారాలు చేస్తున్నారు. అది కూడా రూ.5 వడ్డీకి ఇస్తున్నట్లు తెలిసింది. సకాలంలో చెల్లించని కుటుంబాలను మానసికంగా వేధిస్తున్నారు.

ఏటీఎం కార్డులతో ఖాతాలు ఖాళీ

తమ కింద పనిచేసే కార్మికుడు నెలకు రూ. 1000 కమీషన్?గా ఇవ్వాలి. పైగా తీసుకున్న అప్పునకు ప్రతి నెలా వడ్డీ చెల్లించాలి. వీరు అప్పు ఇచ్చే సమయంలో ముందుగానే వారి నుంచి ఏటీఎం తీసుకుంటున్నారు. గడువు లోపు అసలు, వడ్డీ ఇవ్వకుంటే వారి నుంచి ముందుగా తీసుకున్న ఏటీఎం కార్డుతో వారి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు.

ఆ నిబంధనే వారికి కలిసొచ్చింది

పారిశుద్ధ్య కార్మికులు ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 వరకు విధుల్లో ఉండాలి. ఆపై సంబంధిత అధికారులు, సూపర్?వైజరు ఉదయం, మధ్యాహ్నం కార్మికుల ముఖ హాజరు తీసుకుంటారు. రోజుకు సగటున ఒక్కో కార్మికుడికి వేతనం రూ.550గా ఉంటుంది. అయితే రెండు, మూడు రోజులు విధులకు రాకపోతే దీనికి తగిన విధంగా జీతంలో కోత పడుతుంది. ఈ నిబంధనే సూపర్?వైజర్లకు కలిసొచ్చింది. దీనిలో భాగంగా కొందరు పని చేయకపోయినా హాజరు వేయడం, కొందరికి హాజరు నుంచి మినహాయింపు ఇవ్వడం, నకిలీ హాజరుతో పూర్తి జీతం ఇప్పిస్తామంటూ సూపర్?వైజర్లు కమీషన్లను సంప్రదాయంగా మార్చారు.

కార్మికులు రోడ్డున పడే పరిస్థితి

ఆల్విన్? కాలనీలో పనిచేసే శ్రీనివాస్? అనే సూపర్?వైజర్? కమిషన్లతో పాటు వడ్డీ వ్యాపారం పేరుతో పారిశుద్ధ్య కార్మికులను రోడ్డున పడే పరిస్థితికి తీసుకొచ్చాడని ఆరోపిస్తున్నారు. ఇదే తరహాలో నగరంలోని పటాన్?చెరు, చార్మినార్?, ముషీరాబాద్?, నాగోల్?, మాదాపూర్?, నార్సింగి, సికింద్రాబాద్?, ఎల్?బీనగర్? ప్రాంతాల్లో కొందరు సూపర్ ?వైజర్లు దందాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. వడ్డీ వ్యాపారాలు చేసే సూపర్?వైజర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కార్మికులు డిమాండ్? చేస్తున్నారు.

క్లాసులు జరుగుతుండగా నిర్మాణ పనులు

•విద్యార్థిని తలపై పడిన ఇనుప రాడ్!



టి మీడియా , అక్టోబర్ 9 ,హైదరాబాద్ బ్యూరో : హైదరాబాద్‌లోని బర్కాస్‌లో తీవ్ర నిర్లక్ష్యం ఆందోళన కలిగిస్తోంది. పాఠశాల భవనంలో నిర్మాణ పనులు జరుగుతుండగా, పై అంతస్తు నుంచి ఇనుప రాడ్ కింద పడటంతో 15 ఏళ్ల విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. గురువారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. తరగతులు జరుగుతున్న సమయంలోనే ప్రమాదం జరగడంతో విద్యార్థుల భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బర్కాస్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల భవనంలో రెండో అంతస్తులో నిర్మాణ పనులు చేపడుతున్నారు. అదే సమయంలో కింది అంతస్తుల్లో విద్యార్థినులకు క్లాసులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పై అంతస్తులో ఉన్న ఇనుప రాడ్ అకస్మాత్తుగా ఊడి కింద పడినట్లు సమాచారం. అది నేరుగా ఓ విద్యార్థిని తలపై పడటంతో ఆమెకు తీవ్ర గాయమైంది. వెంటనే వైద్య సహాయం అవసరమైంది. స్కూల్ లో విద్యార్థినులు ఉన్నప్పటికీ నిర్మాణ పనులు తగిన భద్రతా ఏర్పాట్లు లేకుండానే కొనసాగించారని తల్లిదండ్రులు, పాఠశాల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. నిర్మాణ సామగ్రి కింద పడకుండా రక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, అటువంటి జాగ్రత్తలు పాటించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు తరగతుల్లో ఉన్న సమయంలో నిర్మాణ పనులు నిర్వహిస్తే ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం విద్యార్థుల ప్రాణాలకే ముప్పుగా మారుతుందని, ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈ ఘటనపై పోలీసులు కాంట్రాక్టర్‌పై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 125(ఖ) కింద కేసు నమోదు చేశారు. నిర్లక్ష్యపూరిత చర్యల ద్వారా ఇతరుల ప్రాణాలకు లేదా వ్యక్తిగత భద్రతకు ప్రమాదం కలిగించే అంశాలకు సంబంధించిన సెక్షన్ ఇది. ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదు. విద్యార్థిని గాయపడిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నిర్మాణ పనుల సమయంలో భద్రతా నిబంధనలు పాటించారా లేదా అనే అంశాన్ని పరిశీలించాలని తల్లిదండ్రులు, పాఠశాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వకుండా నిర్మాణ పనులు నిర్వహిస్తే ఇలాంటి ప్రమాదాలు రిపీట్ అయ్యే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

•మాజీ ఎంపీ నామ



టీ మీడియా ,అక్టోబర్ 9 , ఖమ్మం :తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు శనివారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో బీఆర్ఎస్ మాజీ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తెలంగాణ ఆడపడుచులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ పండుగకు విశేష ప్రాధాన్యత కల్పించి, రాష్ట్ర పండుగగా గుర్తింపుతో పాటు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని విస్తృతంగా చాటిచెప్పేందుకు కృషి చేసిందని పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు తొమ్మిది పేర్లతో పూలను పేర్చి, ఆటపాటలతో జరుపుకునే బతుకమ్మ వేడుకలు తెలంగాణ ఆడపడుచుల ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తాయని నామ తెలిపారు. మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ నుంచి చివరి రోజు సద్దుల బతుకమ్మ వరకు ప్రతి రోజుకు ప్రత్యేకత ఉంటుందని నామ స్పష్టం చేశారు. తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే బతుకమ్మ పండుగకు కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనివ్వడం ద్వారా రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు మరింత గుర్తింపు లభించిందని వివరించారు. తెలంగాణ సంస్కృతిని భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, ఈ తొమ్మిది రోజుల సంబరాలను మహిళలందరూ సంతోషంగా, నంబ్రవదాయబద్ధంగా జరుపుకోవాలని నామ ఆకాంక్షించారు. బతుకమ్మ పండుగ రాష్ట్ర ప్రజల జీవితాల్లో ఆనందం, ఐక్యత, సౌభాగ్యాన్ని నింపాలని కోరారు.